


శంకరపట్నం: రాజాపూర్‌లో ప్రచారం చేస్తున్న పొద్దుటూరి సంజీవరెడ్డి తదితరులు



గన్నేరువరం: మైలారం గ్రామంలో ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

# మరోసారి ఆదరించండి.. అండగా ఉంటాం



తిమ్మాపూర్: రామకృష్ణకాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న సర్పంచ్ అంజయ్య, రవీందర్‌రెడ్డి తదితరులు

- **ఇంటింటా ఎన్నికల ప్రచారంలో బీఆర్‌ఎస్ నాయకులు**
- **కారు గుర్తుకు ఓటేసి డాక్టర్ రసమయిని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి**

శంకరపట్నం, నవంబర్ 24: ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని మరోసారి ఆదరించి గెలిపించాలని మెట్‌పల్లి సింగిల్ విండో చైర్మన్ పొద్దుటూరి సంజీవరెడ్డి, బీఆర్‌ఎస్ మండల నాయకులు ఓటర్లను కోరారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో మానకొండూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్‌కు మద్దతుగా బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణ దేశంలోనే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే రసమయి నియోజకవర్గ ప్రజలను కడుపులో పెట్టుకుని చూసుకుంటారని తెలిపారు. మరోసారి ఆదరిస్తే ఎల్లవేళలా అండగా ఉంటాం.. అంటూ ఓటర్లను కలిసి అభ్యర్థించారు. కారు గుర్తుకు ఓటేసి డాక్టర్ రసమయి బాలకిషన్‌ను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు కరపత్రాలు పంచిపెట్టారు. బ్యాలెట్ పేపర్ నమూనా, ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

**తిమ్మాపూర్‌లో..**

తిమ్మాపూర్, నవంబర్ 24: మండల వ్యాప్తంగా బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కారు గుర్తుపై ఓటు వేస్తే గ్రామాలు బాగుంటాయన్నారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ గెలిస్తేనే అభివృద్ధి జరుగుతుందని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

**పెద్దలింగాపూర్‌లో..**

ఇల్లంతకుంట, నవంబర్ 24 : పెద్దలింగాపూర్‌లో శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్ గొడిసెల జితేందర్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ ద్వారానే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికార దాహంతోనే సాధ్యం కాని పథకాలను ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందన్నారు. మానకొండూర్ ఎమ్మెల్యేగా డాక్టర్ రసమయి బాలకిషన్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మీసరగండ్ల అనిల్, బొప్ప శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

**మైలారంలో..**

గన్నేరువరం, నవంబర్ 24: మైలారంలో బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఓటర్ల వద్దకు వెళ్లి బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి పనులను ఓటర్లకు వివరించారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామాధ్యక్షుడు నూకల తిరుపతి, నాయకులు వరాల పరశురాములు, కుమారస్వామి, శ్రీనివాస్, గంగరాజు, నూకల చింటూ తదితరులు పాల్గొన్నారు.

## 'దళితులంతా ఏకమై రసమయిని గెలిపించాలి'

తిమ్మాపూర్, నవంబర్ 24: మానకొండూర్ నియోజకవర్గంలోని దళితులంతా ఏకమై ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ను మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని దళిత సంఘ నాయకులు, ప్రజాప్రతినిధులు కోరారు. శుక్రవారం మండలంలోని మల్లాపూర్, పర్లపల్లి గ్రామాల్లో దళిత కుటుంబాలతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మళ్లీ గెలిస్తే నియోజకవర్గంలోని ప్రతి దళిత కుటుంబానికీ దళితబంధు వస్తుందని చెప్పారు. ఎల్ఎండీలో జరిగిన సభలో స్వయంగా సీఎం కేసీఆర్ ఈ మేరకు ప్రకటించారని గుర్తు చేశారు. నియోజకవర్గ అభివృద్ధి రసమయి బాలకిషన్‌తోనే సాధ్యమని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు బోయిని కొమురయ్య, పర్లపల్లి ఎంపీటీసీ ముప్పిడి సంపత్‌రెడ్డి, ఉపసర్పంచ్ రాజేశ్, నాయకులు వంతడుపుల సంపత్, రావరాజు, మాతంగి లక్ష్మణ్, కన్నం నర్సయ్య, దుర్గం అశోక్, కనకయ్య, చంద్రమౌళి, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.



మల్లాపూర్‌లో దళిత మహిళలతో దళిత ప్రజాప్రతినిధులు, నాయకులు

## విద్యార్థినులకు వైద్య పరీక్షలు



వెల్ది పాఠశాలలో విద్యార్థినికి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు శ్రీనిధ

మానకొండూర్ రూరల్, నవంబర్ 24: మండలంలోని వెల్ది జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమం(ఆర్బీఎస్కే) టీం డాక్టర్ శ్రీనిధ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 6 నుంచి 10వ తరగతి విద్యార్థినులు దాదాపు 126 మందికి రక్త, దంత, ఇతరాత్ర పరీక్షలు చేశారు. అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రాపెల్లి శ్రీనివాస్, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## డీజేలు నిషేధం

ఇల్లంతకుంట, నవంబర్ 24 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామాల్లో డీజేలు నిషేధించినట్లు ఎస్ఐ దాస సుధాకర్ తెలిపారు. డీజే యజమానులకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో అనుమతి లేకుండా డీజేలు పెట్టవద్దని సూచించారు. గతంలో డీజే యజమానులను బైండోవర్ చేశామన్నారు. అనుమతులు లేకుండా డీజేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



పోలీస్ స్టేషన్‌లో డీజే యజమానులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సుధాకర్

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఏసీపీ



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న హుజూరాబాద్ ఏసీపీ

వీణవంక, నవంబర్ 24: మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. మండలంలోని చల్లూరు, వీణవంక గ్రామాలలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ, ఎలాంటి గొడవలకు ఆస్కారం లేకుండా ప్రశాంత వాతావరణంలో ప్రజలు ఓటు హక్కును వినియోగించుకునేలా భద్రత చర్యలు చేపట్టాలని పోలీసు సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఆసిఫ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాలకు వాటర్ ఫిల్టర్ వితరణ

తిమ్మాపూర్ రూరల్, నవంబర్ 24: మండలంలోని ఎల్ఎండీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి రూ.40వేల విలువ చేసే వాటర్ ఫిల్టర్‌ను వితరణ చేశారు. మహాత్మానగర్‌కు చెందిన గాదే వంశీకృష్ణ పాఠశాలలో చదువుకున్నాడు. ఉన్నత విద్యనభ్యసించి జర్మనీలో స్థిరపడ్డాడు. తాను చదువుకున్న పాఠశాలకు సహాయం చేయాలని నిర్ణయించుకుని తల్లిదండ్రులు గాదె విజయావెంకటపతి, భార్య నిధితో కలిసి శుక్రవారం ఫిల్టర్‌ను పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా వారిని హెచ్ఎం రాజభాను చంద్రప్రకాశ్ సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

## మద్యం పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులు

తిమ్మాపూర్, నవంబర్ 24: మండలంలోని కొత్తపల్లి శివారులో ఎక్సైజ్ పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా.. రాయినేని రవి అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై 54మద్యం సీసాలను అక్రమంగా తరలిస్తూ పట్టుబడ్డాడని ఎక్సైజ్ సీఐ ఇంద్రప్రసాద్ తెలిపారు. రవిపై కేసు నమోదు చేసి.. మద్యం, వాహనం సీజ్ చేసినట్లు చెప్పారు. అసెంబ్లీ ఎన్నికలనేపథ్యంలో కోడ్ అమలులో ఉన్నందున పరిమితిలోపే మద్యం తీసుకెళ్లాలని చెప్పారు. తనిఖీల్లో ఎస్ఐలు సరిత, శ్రీకాంత్, సిబ్బంది నరేశ్, కొండల్‌రెడ్డి, సురేశ్, రజిత తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ షాపుల్లో ఫార్మసిస్టు తప్పనిసరిగా ఉండాలి



సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ చూపిన విద్యార్థినులకు జ్ఞాపికలు అందజేస్తున్న డాక్టర్ రాజ్యలక్ష్మి, రమేశ్‌రెడ్డి

తిమ్మాపూర్, నవంబర్ 24: మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల శ్రీ చైతన్య ఫార్మసీ కళాశాలలో జాతీయ ఫార్మసీ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించగా.. వరంగల్ జోన్ డ్రగ్ కంట్రోల్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రాజ్యలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మెడికల్ షాపుల్లో తప్పనిసరిగా ఫార్మసిస్టు ఉండాలని, రోగులకు సరైన సూచనలు చేయాలని ఆమె సూచించారు. సమాజానికి సేవ చేసేది చదువు అని, దానిని నిర్లక్ష్యం చేయవద్దని రమేశ్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రామనర్సింహారెడ్డి, అధ్యాపకులు అప్పారావు, రవీందర్‌రెడ్డి, రాంప్రసాద్, చంద్రమౌళి, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## వాగేశ్వరిలో జాతీయ ఫార్మసీ వారోత్సవాలు



హెల్త్‌టాక్ కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల సిబ్బంది, విద్యార్థులు

తిమ్మాపూర్ రూరల్, నవంబర్ 24: మండలంలోని వాగేశ్వరి ఫార్మసీ కళాశాలలో 62వ జాతీయ ఫార్మసీ వారోత్సవాలను పురస్కరించుకొని కరీంనగర్‌లోని మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం హెల్త్ టాక్, ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలోని అధ్యాపకులు, విద్యార్థులు సుమారు 300 మందికి వైద్యులు పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా మెడికవర్ దవాఖాన డాక్టర్ ప్రతిష్టారావు వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, మెడికవర్ సిబ్బంది, డాక్టర్స్ రామ్ కిరణ్, రామనాథం, నాగరాజు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.